నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644


**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

సౌభగమ్ము చేత సంపద వచ్చిన
అహము పెక్కుపెరుగు అవనియందు
తెలివితోడ వచ్చు కలిమియంతయుగూడ
సంతసంబునిచ్చు సత్యమిదియె

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 355 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 22-04 -2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00





## యువతకు ఏటా లక్ష ఉద్యోగాలు

- బెంగాల్ ఎన్నికల ప్రచార సభలో అమిత్ షా హామీ
- మేము రామమందిరం నిర్మిస్తే మమత సన్నిహితుడు బాబ్రీ మసీదు కడుతున్నారని ఆగ్రహం
- ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే ప్రతిభ ఆధారంగా ఉద్యోగ కల్పన
- సిఏఏ పౌర స్మృతిని అమలు చేస్తామని వెల్లడి

**కోల్ కతా**

బెంగాల్ లో తాము అధికారంలోకి వస్తే ఏటా లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ మమత బెనర్జీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "దీదీ ప్రభుత్వం కేవలం అవినీతికి, బంధుప్రీతికి కేరాఫ్ అడ్రస్ గా మారింది. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయి. అర్హులైన అభ్యర్థుల నుంచి ఉద్యోగాలను లాక్కున్నారు" అని విమర్శించారు.
ప్రధానాంశాలు:
ఉద్యోగ కల్పన: బీజేపీ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఒక లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని,

-మిగతా 2 లో



## మళ్లీ అగాధంలో రూపాయి

- డాలర్‌తో 32 పైసలు పతనమై రూ.93.48లకు..

**ముంబయి**

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ వెలవెల పోతోంది. మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ 32 పైసలు క్షీణించి 93.48 వద్ద ముగిసింది. పశ్చిమాసియా శాంతి చర్చల పురోగతిపై నెలకొన్న అనిశ్చితి వల్ల ముడిచమురు ధరలు మళ్లీ పెరగడం. అదే సమయంలో అమెరికా కరెన్సీ బలంగా కొనసాగుతుండటం రూపాయిపై ఒత్తిడి పెంచిందని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిసినప్పటికీ అవి రూపాయిని ఆదుకోలేకపోయాయని పేర్కొన్నాయి. వీటితో పాటు నాన్‌డెలివరబుల్ ఫార్వర్డ్ (ఎన్‌డీఎఫ్) మార్కెట్లలో స్పెక్యులేటివ్ బెట్టింగ్‌లపై ఉన్న ఆంక్షలను సడలిస్తూ రిజర్వ్ బ్యాంక్

-మిగతా 2 లో



## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రైవేట్ పరం చేసే యత్నాలను అడ్డుకుంటాం
- ప్రజలు సమస్యల్లో ఉంటే సభలతో కాలయాపనా
- 25న రాజకీయ శక్తిగా ముందుకు రాబోతున్నాం
- జాగృతి అధ్యక్షురాలు కవిత వెల్లడి

**హైదరాబాద్,**

ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులంటే లెక్కలేనితనంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని కవిత మండిపడ్డారు. ఆర్‌టిసిలో కార్మికులు లేకుండా చేసి సంస్థను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమ్మెకు దిగిన ఆర్టిజన్లను బెదిరించి విధుల్లో చేరేలా ఒత్తిడి చేశారని అన్నారు. ప్రజలందరూ సమస్యల్లో ఉంటే అధికార, ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులంటే ఈ ప్రభుత్వానికి లెక్కలేదని అన్నారు.

-మిగతా 2 లో

# బస్సులు బంద్

## ప్రభుత్వంతో కార్మిక సంఘాల చర్చలు విఫలం

- సమ్మెలోకి 39 వేల మంది ఆర్టీసీ కార్మికులు
- హడావిడిగా ఐఏఎస్‌ల కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- జేఏసీని నాలుగు వారాల గడువు కోరిన కమిటీ
- తిరస్కరించిన ఆర్టీసీ కార్మిక సంఘాలు
- మా డిమాండ్లన్నీ పాతవేనని స్పష్టీకరణ
- నిలిచిపోనున్న 10వేల ఆర్టీసీ సర్వీసులు

**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో సమ్మె సైరన్ మోగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 53 రోజుల చారిత్రాత్మక సమ్మె తర్వాత సంస్థలోని కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా మరోసారి సమ్మెలోకి వెళ్లాయి. సమ్మెలోకి వెళ్తామని టీజీఎస్ఆర్టీసీ జేఏసీ నేతలు ముందుగానే కార్మిక శాఖ ద్వారా నోటీసు ఇచ్చి, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అయినా ప్రభుత్వం సమ్మె నివారణకు ప్రత్యేకంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సమ్మె అనివార్యమని నిర్ధారణ కావడంతో హడావిడిగా మంగళవారం మధ్యాహ్నం నాలుగు శాఖల ఐఏఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తూ జీవో 66 విడుదల చేసింది. ఈ కమిటీలో ఐఏఎస్ అధికారులు వికాస్‌రాజ్, దానకిషోర్,

-మిగతా 3 లో





## ఉద్యోగాల బదిలీలపై నిషేధం ఎత్తివేత

- ట్రాన్స్‌ఫర్లకు మే 1 నుంచి 31 వరకు అవకాశం...
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్**

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల ప్రక్రియ మే 1 నుంచి 31 వరకు కొనసాగుతుందని ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది. జూన్ 1 నుంచి తిరిగి బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 1 నాటికి ఒకే చోట మూడేండ్లు పూర్తి

-మిగతా 2 లో

# సీజ్‌ఫైర్‌ను పొడిగించం!

### ఒప్పందానికి రాకపోతే బాంబుల మోతే..



- ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- రెండో విడత చర్చలపై సందిగ్ధత
- బెదిరింపుల మధ్య చర్చలకు అంగీకరించం: ఇరాన్
- నేటితో ముగియనున్న గడువు

**వాషింగ్టన్**

ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం గడువు ముగిసే బుధవారంలోగా ఇరాన్ తమతో ఒక ఒప్పందానికి రాకపోతే ఆ దేశంపై బాంబుల వర్షం కురిపిస్తామని హెచ్చరించారు. అయితే పాక్‌లోని ఇస్లామాబాద్‌లో జరగాల్సిన రెండో విడత చర్చలపై సందిగ్ధత

-మిగతా 2 లో



## రేపు తమిళనాడు, బెంగాల్ ఎన్నికలు

- తమిళనాడులో అన్ని స్థానాలకు బెంగాల్‌లో తొలి దశలో 152 సీట్లకు పోలింగ్

**కోల్‌కతా, చెన్నై:**

తమిళనాడు ఒకే విడత ఎన్నికలకు, పశ్చిమ బెంగాల్ మొదటి దశ ఎన్నికలకు ప్రచారం మంగళవారం సాయంత్రం ఆరు గంటలతో ముగిసింది. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు, బెంగాల్‌లో తొలి విడత 152 సీట్లకు ఈ నెల 23న జరిగే ఎన్నికలకు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్టు అధికారులు ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లో సర్, ప్రజల ఆహార అలవాట్లు కేంద్రంగా మొదటి విడత ప్రచారం ప్రధాన ప్రత్యర్థులైన అధికార టీఎంసీ, విపక్ష బీజేపీ మధ్య నువ్వా నేనా అన్నట్టుగా సాగింది. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రెండు పార్టీలు పోటీపడి వాగ్దానాలు గుప్పించాయి.ఈ రాష్ట్రంలో వామపక్ష పార్టీలు, కాంగ్రెస్

-మిగతా 2 లో

## కాంగ్రెస్‌కు ఓటెందుకెయ్యాలి?

### సకల జనులను దగా చేసినందుకా...



- ఓటుకు నోటు కేసులో రేవంత్ జైలుకెళ్లడం ఖాయం
- కాళేశ్వరం, ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుల కోసమే ఢిల్లీకి వెళ్లా
- మాజీమంత్రి హరీశ్‌రావు


**హైదరాబాద్**

కాంగ్రెస్‌కు ప్రజలు మళ్లీ ఓటు ఎందుకు వేయాలని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయనందుకా?, సకల జనులను దగా చేసినందుకా?, రాష్ట్రాన్ని స్కాములతో నింపినందుకు ఓటు వేయాలా? దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు సీనియర్ న్యాయవాదులను

-మిగతా 2 లో

## ప్రధాని మోడీ ఓ 'ఉగ్రవాది'

- వివాదం రేపిన ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు
- ఆపై వివరణ ఇచ్చినా చల్లారని మాటల యుద్ధాలు
- 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం సమాఖ్య స్ఫూర్తికి దక్కిన విజయమన్న ఖర్గే



**న్యూఢిల్లీ**

ప్రధాని నరేంద్ర మోడీని ఉగ్రవాదిగా అభివర్ణిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. అయితే దీనిపై వెంటనే స్పందించిన ఆయన, తాను ఆ ఉద్దేశంతో అనలేదని, ప్రధాని మోడీ ప్రజలను, రాజకీయ పార్టీలను భయాందోళనలకు గురిచేస్తున్నారనే అర్థంలో అన్నానని వివరణ ఇచ్చారు.
ఇంతకీ ఖర్గే ఏమన్నారంటే?
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం డీఎంకేతో

-మిగతా 2 లో

## సన్‌రైజర్స్ హ్యాట్రిక్ విక్టరీ

- భారీ టార్గెట్ ముందు బోల్తా కొట్టిన ఢిల్లీ..
- 243 స్కోర్ ఛేజింగ్‌లో ఢిల్లీ ఓటమి
- పాయింట్ల పట్టికలో పైకి ఎగబాకిన ఆరెంజ్ ఆర్మీ

**న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫామ్‌లోకి వచ్చింది. వరుసగా మూడు మ్యాచ్‌లలో విజయం సాధించి, పాయింట్ల పట్టికలో దూసుకెళ్లింది. హోం గ్రౌండ్ ఉప్పల్ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి హ్యాట్రిక్ విక్టరీతో విజయోత్సాహంలో మునిగిపోయింది. భారీ స్కోర్ ఛేజింగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ పోరాడినప్పటికీ ఓటమి తప్పలేదు. 47 పరుగుల మార్జిన్‌తో గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన ఈ

-మిగతా 2 లో



నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
బుధవారం 22 ఏప్రిల్ 2026

# సన్‌రైజర్స్ హ్యాట్రిక్ విక్టరీ

మొదటి తరువాయి

మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ ఎంచుకుంది. ఆరెంజ్ ఆర్మీ ఓపెనర్ అభిషేక్ శర్మ తన మార్క్ బ్యాటింగ్‌తో మరోసారి విరుచుకుపడ్డాడు. 47 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్న అభిషేక్ 135 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఆఖర్లో క్లాసెన్ అదరగొట్టడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 20 ఓవర్లలో 242/2 స్కోర్ చేసింది.భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆరంభంలోనే ఓపెనర్ పాతూమ్ నిస్సాంక వికెట్ కోల్పోయింది. 21 పరుగులకే తొలి వికెట్ కోల్పోయినా ఫస్ట్ డౌన్‌లో వచ్చిన నితీష్ రాణా సన్‌రైజర్స్ బౌలర్లను చెడుగుడు ఆడుకున్నాడు. ఒకానొక దశలో డేంజరస్‌గ్గ కనిపించిన ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఈషాన్ మలింగ దెబ్బ కొట్టాడు.ల్లీ స్కోర్ 107 పరుగుల వద్ద కేఎల్ రాహుల్‌ను షాకీబ్ హుస్సేన్ అవుట్ చేయగా.. ఆ తర్వాత ఓవర్‌లోనే నితీష్ రాణా, డేవిడ్ మిల్లర్లను ఇషాన్ మలింగ వెంటవెంటనే అవుట్ చేశాడు. దాంతో 107 పరుగులకే ఢిల్లీ నాలుగు వికెట్లు కోల్పోయింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా మరోవైపు ఢిల్లీ బ్యాటర్లు బౌండరీలు బాదుతూనే ఉన్నారు.ట్రిస్టన్ స్టబ్స్ - సమీర్ రిజ్వీ కలిసి ఐదో వికెట్‌కు 59 పరుగులు జోడించారు. ఈ ఇద్దరూ 33 బంతులు ఆడగా స్టబ్స్ 27, రిజ్వీ 32 పరుగులు బాదారు. ఈ డేంజరస్ పార్ట్‌నర్‌షిప్‌ను మళ్లీ ఇషాన్ మలింగానే బ్రేక్ చేశాడు. వరుస బౌండరీలు బాదుతున్న స్టబ్స్ 16 బంతుల్లో 27 పరుగులు చేసి అవుటయ్యాడు. దాంతో ఢిల్లీ 166 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయింది. అశుతోష్ 14, అక్షర్ 2, సమీర్ రిజ్వీ 41 పరుగులు చేసి అవుటయ్యారు. ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. దాంతో సన్‌రైజర్స్ 47 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఇషాన్ మలింగ నాలుగు ఓవర్లు వేసి 32 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీసి ఆకట్టుకోగా.. హర్ష్ దూబే 2 ఓవర్లలో మూడు వికెట్లు పడగొట్టాడు.

# ప్రధాని మోడీ ఓ 'ఉగ్రవాది'

మొదటి తరువాయి

ఏఐఏడీఎంకే పొత్తు పెట్టుకోవడాన్ని ప్రశ్నిస్తూ ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "అన్నాదురై ఫోటో పెట్టుకుని ఏఐఏడీఎంకే వారు మోడీతో ఎలా కలుస్తారు? ఆయన ఒక ఉగ్రవాది. ఆయన పార్టీకి సిద్ధాంతం, న్యాయంపై నమ్మకం లేదు. అంతా టియర్ (భయం) పేరుతో కలవడం అంటే ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే. అన్నాదురై, కామరాజ్, పెరియార్, కరుణానిధి, బాబాసాహెబ్ అంబేద్కర్ సిద్ధాంతాలను నీరుగారుస్తున్నారు." అని అన్నారు.

బీజేపీ స్పందన:

ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. ఒక జాతీయ పార్టీకి అధ్యక్షుడిగా ఉండి, దేశ ప్రధానిని ఉగ్రవాది అనడం ఖర్గే విచక్షణకే వదిలేస్తున్నామని, ఇది ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.

మహిళా రిజర్వేషన్లు:

మరోవైపు మహిళా రిజర్వేషన్ల కోసం నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)తో ముడిపెట్టడం ద్వారా బీజేపీ ఒక ప్రమాదకరమైన ఆట ఆడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడాన్ని ఆయన స్వాగతించారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే, జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు

# యువతకు ఏటా లక్ష ఉద్యోగాలు

మొదటి తరువాయి

ఐదేళ్లలో మొత్తం 5 లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు.
అవినీతి రహిత పాలన: ఉద్యోగాల కల్పనలో ఎలాంటి పైరవీలకు తావులేకుండా కేవలం ప్రతిభ ఆధారంగానే నియామకాలు జరుగుతాయని స్పష్టం చేశారు.

రామమందిరం - బాబ్రీ మసీదు: అయోధ్యలో తాము రామమందిరాన్ని నిర్మిస్తుంటే, మమత బెనర్జీ సన్నిహితుడైన ఒక నేత బాబ్రీ మసీదును నిర్మిస్తామని అంటున్నారని, ఇలాంటి వ్యక్తులకు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు.సిఏఏ అమలు: బెంగాల్ లో పౌరసత్వ సవరణ చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తామని, శరణార్థులకు పౌరసత్వం కల్పిస్తామని అమిత్ షా పునరుద్ఘాటించారు.

# ఉద్యోగాల బదిలీలపై నిషేధం ఎత్తివేత

మొదటి తరువాయి

చేసుకున్న ఉద్యోగులు బదిలీకి అర్హులు. అయితే నాలుగేండ్లు పూర్తి చేసుకున్న వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. 2027 మే 31కి ముందు ఉద్యోగ విరమణ చేయనున్న ఉద్యోగులకు దీన్నుంచి మినహాయింపు ఉంటుంది. వీరు బదిలీని కోరుకునే అవకాశం వారికే కల్పిస్తారు. జీవిత భాగస్వామి ఆధారంగా కోరుకునే బదిలీలకు మూడేండ్ల నిబంధన వర్తించదని జీవోలో స్పష్టం చేశారు. ఏ ఒక్క క్యాడర్‌లో కూడా 40శాతం కంటే ఎక్కువ మంది ఉద్యోగులను బదిలీ చేయకూడదు. బదిలీల ప్రక్రియ మొత్తం కౌన్సెలింగ్ పద్ధతిలో సాధ్యమైనంత వరకు ఆన్‌లైన్/వెబ్ ఆధారిత అప్లికేషన్ ద్వారా పారదర్శకంగా జరగాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే బదిలీల సమయం లో భార్యాభర్తలు (ఒకరికి మాత్రమే), ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నవారు, 70 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు, మానసిక వికలాం గులైన పిల్లలున్న తల్లిదండ్రులు, వితంతువులు, క్యాన్సర్, న్యూరో సర్జరీ, కిడ్నీమార్పిడి, లివర్ మార్పిడి, ఓపెన్ హార్ట్ సర్జరీ, బోన్ టీబీ వంటి వైద్య అవసరాలు కలిగిన వారికి ప్రాధాన్యతనిస్తారు. అయితే నిబంధనలను ఉల్లంఘిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. సెన్సస్ (జనాభా గణన) సంబంధిత పనుల్లో ఉన్న ఉద్యోగులకు ఈ నిబంధనలు వర్తించబోవని స్పష్టం చేసింది. బదిలీల ప్రక్రియను పర్యవేక్షిం చడానికి క్యాడర్ వారీగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది. స్టేట్, మల్టీ-జోనల్/జోనల్, జిల్లా స్థాయిల్లో అధికారుల నేతత్వంలో ఈ కమిటీలు పని చేయనున్నాయి.

# రేపు తమిళనాడు, బెంగాల్ ఎన్నికలు

మొదటి తరువాయి

కూడా రంగంలో ఉన్నప్పటికీ ప్రధాన పోటీ టీఎంసీ-బీజేపీ మధ్యే జరుగుతున్నది. మొదటి విడతలో 3.60 కోట్ల మంది ప్రజలు ఓటును వినియోగించుకోనున్నారని ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికల సందర్భంగా రికార్డు స్థాయిలో 2,450 కంపెనీల కేంద్ర పారామిలిటరీ బలగాలకు చెందిన 2.5 లక్షల మందిని మోహరించారు. వరుసగా నాలుగోసారి అధికారం చేపట్టాలని మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఆశపడుతున్నది. అయితే ఆమెను ఎలాగైనా గద్దెదించి తొలిసారిగా బెంగాల్ పీఠం ఎక్కాలని బీజేపీ ఉవ్విళ్లూరుతున్నది. ఇటీవల 'సర్' పేరిట రాష్ట్రంలో 91 లక్ష ఓట్ల తొలగింపుపై ఆ పార్టీ ఆశలు పెట్టుకుంది. యూనిఫామ్ సివిల్ కోడ్‌ను అమలు చేస్తామని, చొరబాట్లను అడ్డుకుంటామని, ఉద్యోగాలు కల్పిస్తామని, సరిహద్దులను పటిష్టం చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ డీఏను చెల్లిస్తామని కమలం పార్టీ ఈ ఎన్నికల్లో ప్రధానంగా హామీ ఇచ్చింది. ముఖ్యంగా హిందూ ఓట్లపై ఆ పార్టీ ఆశలు పెట్టుకుంది. సర్ పేరిట అక్రమంగా ఓట్ల తొలగింపునకు పాల్పడిందని, బీజేపీ అధికారంలోకి వస్తే మాంసం, చేపలు, గుడ్లు తినడంపై నిషేధం విధిస్తుందని టీఎంసీ ఆరోపించింది. తాము మరోసారి అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీనిచ్చింది.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మొదటి తరువాయి

ఆర్‌టిసిని ప్రైవేటుపరం చేసే కుట్రలను అడ్డుకుంటామని హెచ్చరిచారు. వెంటనే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం, ప్రతిపక్షం సభలు పెట్టాయంటూ మండిపడ్డారు. ప్రతిపక్షం ఉట్టికథలు చెబితే.. ప్రభుత్వం పిట్టకథలు చెప్పిందంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సభలో బీజేపీపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల గురించి ఎందుకు మాట్లాడలేదని జాగృతి అధ్యక్షురాలు నిలదీశారు. వెయ్యి ఏళ్లైనా బీఆర్ఎస్ మారదని కవిత వ్యాఖ్యానించారు. గుంటనక్క నిన్న ఢిల్లీ వెళ్లి ఆర్ఎస్ఎస్ పెద్దలను



కలిసిందన్నారు. ప్రాజెక్ట్‌ల్లో అవినీతి నుంచి బయటపడేందుకు ఆర్ఎస్ఎస్‌తో చర్చలు జరిపారంటూ కవిత ఆరోపించారు. ఈనెల 25న తెలంగాణ రాజకీయాల్లోకి నూతన రాజకీయ శక్తిగా వస్తున్నామని, ప్రజలందరికీ ఈ వేదిక నుంచి ఆహ్వానం పలుకుతు న్నామని చెప్పారు. పార్టీ ఆవిర్భావ సభకు సిరిసిల్ల నుంచి పార్టీ కార్యకర్తలు మంగళవారం పాదయాత్రగా బయలుదేరారని తెలిపారు. తమ పార్టీ ఆవిర్భావ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే క్యాడర్ వాహనాలకు ఎలాంటి ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దని పోలీసులు, అధికార యంత్రాంగాన్ని కోరారు.

# బస్సులు బంద్

మొదటి తరువాయి

సందీప్‌కుమార్ సుల్తానీయా, ఎండీ వై నాగిరెడ్డి ఉన్నారు. వీరు ఆర్టీసీ కార్మిక సంఘాలను సచివాలయంలో చర్చలకు రావాలని ఆహ్వానించారు. జేఏసీలోని కార్మిక సంఘాలతో పాటు సమ్మెకు మద్దతు తెలుపుతున్న టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, టీఎమ్‌యూ (అశ్వత్థామరెడ్డి), ఐఎన్‌టీయూసీ సంఘా లు కూడా చర్చలకు వెళ్లాయి. కమిటీ నూతనంగా ఏర్పడినందున సమస్యల్ని అధ్యయనం చేసేందుకు తమకు నాలుగు వారాల సమయం కావాలని ఐఏఎస్‌ల కమిటీ కోరింది. ఈ ప్రతిపాదనను జేఏసీతో పాటు కార్మిక సంఘాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయి. తమ డిమాండ్లు కొత్తవేం కాదని తేల్చిచెప్పాయి. సమ్మెను నిర్వీర్యం చేసే కుట్రగా పేర్కొన్నాయి. మంగళవారం అర్ధరాత్రి మొదటి డ్యూటీ నుంచే కార్మికులంతా సమ్మెలోకి వెళ్తున్నట్టు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. ఆర్టీసీ కార్మికులు తప్పనిసరి పరిస్థితుల్లోనే సమ్మెకు వెళ్తున్నారనీ, తమ 32 డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు పోరడ తామని టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ ఈదురు వెంక న్న, వైస్‌చైర్మెన్ ఎమ్ థామస్‌రెడ్డి స్పష్టం చేశారు.

**ఉద్దేశపూర్వక జాప్యం**

బీఆర్ఎస్ హయాంలో ఆర్టీసీ కార్మికులు 53 రోజులు సమ్మె చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపింది. అధికారంలోకి వస్తే ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్



ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటినా, ఇప్పటికీ ఆర్టీసీ కార్మికుల ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై కార్మిక సంఘాల వివిధ రూపాల్లో అనేక ఆందోళనలు చేపట్టాయి. సంస్థలో ఇప్పటికీ ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన యూనియన్ల రద్దు ఉత్తర్వులే అమల్లో ఉన్నాయంటూ యాజమాన్యం కార్మికశాఖ వద్ద జరిగే చర్చలకు కూడా హాజరుకాలేదు. అనివార్యంగా ఆర్టీసీ కార్మికుల సమ్మెబాట పట్టాల్సి వచ్చింది.

**ప్రయాణీకులకు ఇబ్బందులు**

ఆర్టీసీ కార్మికుల సమ్మెతో రాష్ట్రంలో పల్లెవెలుగు నుంచి రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సుల వరకు నిలిచి పోనున్నాయి. దాదాపు 10వేల బస్సుల డిపోలకే పరిమితం అవుతున్నాయి. ఆర్టీసీలోని అద్దె బస్సుల సిబ్బంది కూడా సమ్మెకు సంఘీభావంగా విధులు బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. సమ్మెతో రాష్ట్రంలో సామాన్య ప్రజలకు రవాణా కష్టాలు తప్పవు.

**97 డిపోల్లో..10 వేల బస్సులు**

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీకి 97 డిపోల్లో 10 వేల బస్సులు ఉన్నాయి. వీటిలో దాదాపు 3,500 అద్దె బస్సులు ఉన్నాయి. సంస్థలో 39 వేల మంది కార్మికు లు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ బస్సులు రోజుకు 36 లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణం చేస్తున్నాయి.

సమస్యల పరిష్కారానికి సానుకూలం: మంత్రి పొన్నం

తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్ణయాలు తీసుకోవడంలో కొంత జాప్యం జరిగిందని అంగీకరించారు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన అన్ని అంశాలను పరిశీలించేందుకు నలుగురు ఐఎఎస్ అధికారులతో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఆర్టీసీ ప్రతినిధులంతా ఆ కమిటీకి సమస్యలు విన్నవిస్తే, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తాను అధికారుల దగ్గర చర్చించి పరిష్కరిస్తామని చెప్పారు.

# మళ్లీ అగాధంలో రూపాయి

మొదటి తరువాయి

ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తీసుకున్న తాజా నిర్ణయం కూడా భారత కరెన్సీపై కొంత ప్రభావం చూపిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

మూడో రోజూ మార్కెట్లకు లాభాలు..

అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చల ఆశావహ సంకేతాలు, అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గొచ్చనే అంచనాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ భారీ లాభాలను సాధించాయి. మంగళవారం బీఎస్ఈ సెన్సెక్స్ 753.03 పాయింట్లు పెరిగి 79,273కు చేరుకుంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 211.75 పాయింట్ల లాభంతో 24,576 స్థాయి వద్ద ముగిసింది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లు రాణించడంతో ఇంట్రాడేలో సెన్సెక్స్ 79,367 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి షేర్లు అధిక లాభాలను నమోదు చేశాయి. మరోవైపు రిలయన్స్, టైటాన్, ఎన్‌టీపీసీ వంటి స్టాక్స్ అధిక నష్టాలను మూటగట్టుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర 94.70 డాలర్ల వద్ద, బంగారం ధర 4781 డాలర్ల వద్ద నమోదయ్యాయి.


నిఫ్టీ 27వేల ఎగువకు చేరొచ్చు : పిఎల్ క్యాపిటల్

గత మూడు నెలల్లో నిఫ్టీ 6.6 శాతం పతనాన్ని చవిచూసినప్పటికీ.. 2026-28 ఆర్థిక సంవత్సరాల మధ్య ఏడాది సగటు ఆదాయాలు 15 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని పిఎల్ క్యాపిటల్ అంచనా వేసింది. నిఫ్టీ భవిష్యత్ లక్ష్యాన్ని 27,080 పాయింట్లుగా పిఎల్ క్యాపిటల్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. "ప్రపంచ అనిశ్చితులు, చమురు ధరల పెరుగుదల స్వల్పకాలిక సవాళ్లను విసురుతున్నప్పటికీ, మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు, పారిశ్రామిక ఉత్పత్తి వంటి దేశీయ అంశాలు మార్కెట్ స్థిరత్వానికి తోడ్పడతాయి" అని ఆ సంస్థ ఇన్‌స్ట్యూషనల్ ఈక్విటీస్ కోహెడ్ అమ్నిష్ అగర్వాల్ పేర్కొన్నారు.

# సీజ్‌ఫైర్‌ను పొడిగించం!

మొదటి తరువాయి

నెలకొన్నది. తమ ప్రతిపాదనలపై ఇరాన్ నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడంతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన ఇస్లామాబాద్ పర్యటనను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నట్టు సమాచారం. శాంతి చర్చలకు అమెరికా బృందానికి వాన్స్ నేతృత్వం వహిస్తున్నారు. అమెరికాతో రెండో విడత చర్చల్లో పాల్గొనేందుకు ఇరాన్ దేశ అధికారిక సమ్మతి కోసం తాము ఇంకా వేచి చూస్తున్నామని పాకిస్థాన్ మంత్రి అత్తవుల్లా తరార్ మంగళవారం ప్రకటించారు.



సీజ్ ఫైర్‌ను పొడిగించం

ఇరాన్‌తో సీజ్‌ఫైర్‌ను పొడిగించనని ట్రంప్ స్పష్టం చేశారు 'వారు కనుక శాంతి ఒప్పందం చేసుకుంటే తమను తాము బలమైన దేశంగా, అద్భుతమైన దేశంగా మరోసారి తీర్చిదిద్దుకోగలుగుతారు. యుద్ధాన్ని ముగించడానికి ఇరాన్‌తో అమెరికా ఒక గొప్ప ఒప్పందానికి వస్తుంది. వారికి ఇంకో అవకాశం లేదని నేను భావిస్తున్నానని' ట్రంప్ తెలిపారు. రెండో విడత చర్చల నుంచి ఏం ఫలితాలు ఆశిస్తున్నారన్న మీడియా ప్రశ్నకు 'మేం వారి నాయకులను తొలగించాం.

ఇది ఒక విధంగా పరిస్థితులను క్లిష్టతరం చేస్తున్నది. అయినా ఈ నాయకులు హేతుబద్ధంగా ఉన్నారు. మీరు దానిని ఏమని పిలిచినా అది పాలన మార్పే. నేను చేస్తానని చెప్పని పని ఇది. కానీ నేను దానిని పరోక్షంగా చేసి చూపించాను' అని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ బెదిరింపుల నేపథ్యంలో ఇరాన్ స్పందించింది. తమపై బెదిరింపులకు పాల్పడుతున్న నేపథ్యంలో వారితో చర్చలకు అంగీకరించబోమని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ ఘాలిబాఫ్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌కు ఓటెందుకెయ్యాలి?

మొదటి తరువాయి


కలిసేందుకే తాను, ఎంపీ రవిచంద్ర, మాజీ ఎంపీ వినోద్ కుమార్ శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి ఢిల్లీకి వెళ్లామనీ, అందులో దాచిపెట్టేదేం లేదని చెప్పారు. కాళేశ్వరం కేసులో తీర్పు ఏ విధంగా వచ్చినా సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి ఉంటుందనీ, వచ్చేనెల ఆరో తేదీన హైకోర్టులో రాబోతున్న ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసుల కోసం సీనియర్ న్యాయవాదులను సంప్రదించడానికే ఢిల్లీకి వెళ్లామన్నారు. కాంగ్రెస్ బీఫామ్‌పై ఎంపీగా పోటీ చేసి కూడా ఆయన ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నానంటూ ఒక ఎమ్మెల్యే అనడం, దాన్ని స్పీకర్ ధ్రువీకరించడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణకు వస్తుందన్నారు. పట్టపగలు బ్యాగులతో దొరికిపోయిన దొంగ రేవంత్ రెడ్డి అనీ, ఇప్పుడు హోంమంత్రిగా ఆయనే ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం తరఫున నామమాత్రపు న్యాయవాదులను పెట్టి, వ్యక్తిగతంగా ఆయన తరఫున ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా వంటి ఖరీదైన న్యాయవాదులను పెట్టుకున్నారని వివరించారు. ఈ ఓటుకు నోటు కేసులో బీఆర్ఎస్ తరఫున జగదీశ్‌రెడ్డి, సంజరు, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ ఇంప్లీడ్ అయ్యారని అన్నారు. నాడు సమైక్య వాదులతో చేతులు కలిపి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని కుట్ర చేసింది రేవంత్‌రెడ్డి కాదా? అని ప్రశ్నించారు. నాలుగున్నరేండ్ల నుంచి స్టేల మీద బతుకుతున్న రేవంత్ రెడ్డికి ఆ స్టే వెకేట్ అయిందంటే ముఖ్యమంత్రి సీటు ఊడటం, ఆయన జైలుకు వెళ్లడం ఖాయమని చెప్పారు. కేసీఆర్ 'స్టేట్స్ మన్' లాగా రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాడితే రేవంత్‌రెడ్డి ఆయన కుర్చీ కోసం 'స్ట్రీట్ మన్' లాగా మాట్లాడారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సభకు పోటీగా అదే సమయానికి మైకు పట్టుకుని రేవంత్‌రెడ్డి సంకుచిత బుద్ధిని బయటపెట్టుకున్నారని అన్నారు. కేసీఆర్ వస్తున్నారని భయపడి డైవర్షన్ కోసం ఒక కిస్తీ రైతు భరోసా వేశారని చెప్పారు.

## శ్రీరంగవరం పాఠశాలలో పాకశాల ప్రారంభోత్సవం



**మేడ్చల్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జగతి ఫౌండేషన్, అమెజాన్ సహకారంతో విద్యా మిత్ర కార్యక్రమం భాగంగా శ్రీరంగవరం ప్రాథమిక పాఠశాలలో తొలి పాకశాల (కిచెన్ షెడ్) ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జగతి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు దుర్గాకళ్యాణి, జాయింట్ సెక్రటరీ రత్న రాజా, పాఠశాల హెడ్‌మాస్టర్ మిద్దే సుజాత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాకశాల ద్వారా పరిశుభ్రమైన ఆహార తయారీ, విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, పాఠశాల సౌకర్యాల బలోపేతం లక్ష్యంగా పెట్టుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఇది గొప్ప మద్దతుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సరిత గంగుల, దుర్గా భవాని, ఝూన్సీ రాణి, ఆద్వికతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కర్నె అరవింద్‌కు ఘన నివాళి



**ఇబ్రహింపట్నం, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధి కర్నె అరవింద్ దశదిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా టీజేఏసీ పూర్వ కో-కన్వీనర్ ఎండీ గౌస్, మంచాల మండల టీజేఏసీ పూర్వ చైర్మన్ జంగయ్య పాల్గొన్నారు.

## గ్రామకంఠం భూమిపై విచారణ



**మర్రిగూడ, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఖుదాబక్షపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామకంఠం భూమిని కొంతమంది వ్యక్తులు కబ్జా చేసిన విషయంపై సర్పంచ్ పందుల జయలక్ష్మి పాండుగౌడ్ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో రవికుమార్ విచారణ చేపట్టి అక్రమంగా వేసిన ఫెన్సింగ్ తొలగించారు. గ్రామకంఠం భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## దేవుని బండ తండలో మహిళా సమైక్య భవనం ప్రారంభం



**షాద్‌నగర్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఫరూక్‌నగర్ మండలంలోని దేవుని బండ తండ గ్రామపంచాయతీలో రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సమైక్య భవనాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "గిరిజనులు నిజాయితీ గలవారు. ఇచ్చిన మాట ప్రకారం మహిళా సంఘ భవనాన్ని శాంక్షన్ చేసి ప్రారంభించాం. అదేవిధంగా త్రాగునీటి సమస్యను తీర్చేందుకు మిషన్ భగీరథ పైపులైన్ సంపు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నాం" అని తెలిపారు. సర్పంచ్ ముడవత్ శ్రీను మాట్లాడుతూ, "ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ గ్రామానికి సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌కు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు. ఆయనకు ఎల్లప్పుడూ మద్దతు ఇస్తాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాదావత్ శ్యాంలాల్, కార్యదర్శి గీతా, వార్డు సభ్యులు, గ్రామ యువకులు, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమ్మమ్మ కథ ఎటుపోయింది?



### సెల్ ఫోన్ చెరలో చిక్కుకున్న బాల్యం!

ఒకప్పుడు సాయంత్రం అయిందంటే చాలు.. అందరి ఇళ్ళల్లో , కథల సందడి ఉండేది. తాతయ్య మోకాళ్లపై కూర్చుని వినే 'మర్యాద రామన్న' కథలు, అమ్మమ్మ చెప్పే 'చందమామ' ముచ్చట్లు పిల్లల్లో ఊహాతెలివిని, నైతిక విలువలను నరనరాల్లో నింపేవి. కానీ నేడు? ఆ దృశ్యం మారిపోయింది. గోరుముద్దలతో పాటు కథలు చెప్పాల్సిన చేతులు.. నేడు సెల్ ఫోన్లను అందిస్తున్నాయి. నేటి పిల్లలు పాఠ్యపుస్తకాల భారంలో నలిగిపోతున్నారు. చదువు అంటే కేవలం ర్యాంకుల కోసమే అన్నట్లుగా మారిపోయింది. సాంకేతిక మాయాజాలం: వాట్సప్ స్టేటస్‌లు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, స్నాప్‌చాట్ ఫిల్టర్ల మధ్య అసలైన భావోద్వేగాలు కనుమరుగవుతున్నాయి.

అందరిలో ఉన్నా.. ఒంటరితనం! తరిగిపోతున్న భాషా సంపద: గూగుల్, చాట్ జీపీటీల ద్వారా సమాచారాన్ని పొందుతున్నారే తప్ప, సొంతంగా ఆలోచించే శక్తిని కోల్పోతున్నారు. చదవడం, రాయడం అనేది కేవలం క్లాస్ రూమ్ బోర్డు మీద నుంచి బుక్కులోకి మారే ఒక 'మెకానికల్' ప్రక్రియగా మారిపోయింది.

**సాహిత్యం: జీవితానికి దిక్సూచి**



వేమన పద్యం కేవలం ఆటవెలది కాదు, అది జీవితపు నడక. సుమతీ శతకం కేవలం పంక్తులు కావు, అవి సమాజంలో ఎలా ఉండాలో నేర్పే పాఠాలు. రామాయణ, భారత ఇతిహాసాల ద్వారా ధర్మం, దానం, పవిత్రత వంటి గుణాలను అలవోకగా నేర్చుకున్న తరం మనది. కానీ నేటి పిల్లలకు ఆ వారసత్వం అందడం లేదు. ఉమ్మడి కుటుంబాలు లేక, కథలు చెప్పేవారు కరువై వారి ప్రవర్తన అగమ్యగోచరంగా మారుతోంది.

**తల్లిదండ్రులారా.. మేల్కొందాం!**

ఈ సెలవులను కేవలం విహారయాత్రలకో, సమ్మర్ క్యాంపులకో పరిమితం చేయకండి. మీ పిల్లల చేతికి ఒక 'పెద్దబాలశిక్ష' అందించండి.

తెనాలి రామలింగడి చమత్కారాన్ని పరిచయం చేయండి.

పంచతంత్ర కథల ద్వారా నీతిని బోధించండి.

అక్బర్-బీర్బల్ కథలతో ఆలోచనా శక్తికి పదును పెట్టండి.

**పఠనం:** రోజుకు కనీసం రెండు కథలు చదివించడం.

**లేఖనం:** చదివిన కథను తమ సొంత మాటల్లో రాయించడం.

**కథా ప్రసంగం:** ఆ కథలోని నీతిని అందరి ముందు చెప్పించడం.

ఇలా చేయడం వల్ల కేవలం భాషా నైపుణ్యమే కాదు, వారిలో వాక్పటిమ (జఠీఎబఅఱఘ్‌అఠీఅ ూనిఅశ్రీశ్రీం) మెరుగవుతుంది. పదజాలం పెరుగుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా, పెద్దల పట్ల గౌరవం, తోటివారితో సఖ్యత కలిగిన ఒక సంస్కారవంతమైన తరం తయారవుతుంది.

పుస్తకం మనిషికి మౌనంగా ఉండే గొప్ప గురువు. చరవాణి ప్రపంచం నుంచి మన పిల్లలను కాపాడుకుందాం. వారి చేతుల్లో పుస్తకాన్ని పెట్టి.. వారి మేధస్సుకు, వ్యక్తిత్వానికి పదును పెడదాం. అప్పుడే నేటి బాల్యం జ్ఞానోదయంతో వెలుగుతుంది!

మీ
విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు
కరీంనగర్-తెలంగాణా

## అంగరంగ వైభవంగా ఉద్యోగ విరమణ సన్మానం



**మర్రిగూడ, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ గ్రామానికి చెందిన చిలుకూరి కేశవ గట్టుప్పల్ మండలం తేరేట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (గణితం)గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా బట్లపల్లి శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఘనంగా వీడ్కోలు సన్మానోత్సవం జరిగింది. 95--96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆయనతో పాటు ధర్మపత్నీ పద్మ గారిని శాలువాతో సన్మానించి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, సర్పంచ్ శిరీష లోకేష్ గౌడ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పూర్వ విద్యార్థులు జైపాల్ రెడ్డి, వంశీధర్ రావు, బొడ్డు వెంకట్, డీ. జానయ్య, పిట్టల కృష్ణ, గంట తిరుమలేష్, బురుగు నాగరాజు, గుప్త ఏలుగు శ్రీనివాస్, గుణగంటి వెంకటేష్ గౌడ్, రావుల శ్రీనివాస్, అమరేందర్, చందా మాధవి, పుష్పలత, అనిత, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌పిడీసీఎల్ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం



**పెద్దపల్లి, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పెద్దపల్లి సర్కిల్ కార్యాలయంలో ఎన్‌పిడీసీఎల్ ఉద్యోగులు, సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఎముకల సమస్యలు, షుగర్, బీపీ, ఈసీజీ, 2డి ఎకో వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ ఉద్యోగులకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిడీసీఎల్ అధికారులు, మెడికవర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్‌గా ఎంపికైన శ్రావణ్ కుమార్ రెడ్డికి ఘన సన్మానం



**కొందుర్గు, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలానికి చెందిన చింతకింది శ్రావణ్ కుమార్ రెడ్డి ఏలూరు (ఆంధ్రప్రదేశ్) కలెక్టర్‌గా ఎంపిక కావడంతో స్వగ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో ఆయనకు శాలువాతో ఘన సన్మానం చేసి అభినందనలు తెలిపారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ, "శ్రావణ్ కుమార్ రెడ్డి సాధించిన విజయంతో గ్రామానికి మంచి గుర్తింపు వచ్చింది. యువతకు ఆయన ఆదర్శంగా నిలుస్తారు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన తండ్రి శివశంకర్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

## లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**మిర్యాలగూడ, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి క్యాంప్ కార్యాలయంలో వేములపల్లి, మాడ్గులపల్లి మండలాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు రూ.60 లక్షల 6 వేల 960 విలువ గల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భారం లేకుండా మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సంక్షేమ పథకాలను పారదర్శకంగా, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందిస్తున్నాం" అని తెలిపారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

**-ఆర్డీవో కు వినతి.**




**దేవరకొండ ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 657 గల ప్రభుత్వ భూమి లో అక్రమంగా ఇంటి నిర్మాణం, కొంతమంది వ్యక్తులు ప్లాట్ల రూపంలో కబ్జా చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటూ స్వాధీనం చేసుకోవాలని దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డికి, దేవరకొండ ఎమ్మార్వో సూపర్డెంట్ రేణుకకి సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ వేరు వేరు గా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 657లో డిండి హైవే రోడ్ ఎల్ఐసి ఆఫీస్ వెనుక భాగాన బంజారా కాలనీ తూర్పు భాగాన కొంతమంది అక్రమంగా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తూ గృహ నిర్మాణాలు చేస్తున్నారు. కొంతమంది వ్యక్తులు ప్లాట్ల రూపంలో కబ్జా చేస్తూ రాళ్లతో హద్దులు నిర్మాణం చేసుకొని ప్రభుత్వ భూమిని కాజేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. దీనివలన ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వ అవసరాలకు భవిష్యత్తులో ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంటుంది. అక్రమంగా భూమిలోఇండ్ల నిర్మాణం చేస్తూ కొంతమంది హద్దురాళ్లతో కబ్జాకు గురి చేయడం వల్ల భూదోపిడి జరుగుతుంది. ప్రజా ప్రయోజనాల దృశ్య ఇట్టి భూమిని స్వాధీన పరుచుకొని ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకుంటే మంచిగుంటుందని మా అభిప్రాయం. భూమిని పరిశీలించి సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ భూమి కాపాడాలని మా యొక్క మనవి. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత, భీమగోల శివ గౌడ్ , పెరికేటిశ్రీనివాస్ చారి, డాక్టర్ భాషా చౌహన్ ,నటవ సుధాకర్, పున్న బిక్షమయ్య, గడ్డం బిక్షమయ్య, గణేష్ ,హరి ,చెరుకు అంజి గౌడ్, అనిల్ గౌడ్, సంజీవ యాదవ్, యాదయ్య చారి, అంకం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కర్నె అరవింద్ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న హరీష్ రావు



**ఇబ్రహింపట్నం, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు కర్నె అరవింద్ దశదిన కార్యక్రమంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. వారు అరవింద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహింపట్నం నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కొర్రతండాలో పోషణ పక్షం

**-సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ ,ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయలక్ష్మి.**



**దేవరకొండ ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామ పంచాయతీ కొర్రతండా లో అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు ఈసమావేశానికి ముఖ్యతిధిలుగా స్థానిక సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ ,సూపర్ వైజర్ విజయలక్ష్మి హాజరై బాలింతలు గర్భిణీ మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు ఆహారం గురించి వివరించారు. అదేవిధంగా బాల్యవివాహాలను అరికట్టెల చూడాలని కోరారు మిషన్ వాత్సల్య కింద తల్లి తండ్రులు లేనివారిని గుర్తించి వారిని ఈ పథకంలో చేర్పిస్తే నెలకు 4000 వేళా రూపాయలు ఇస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో డీసీపీయూ సభ్యులు జెల్లా అంజలి,వార్డు సభ్యులు కొర్ర సునీత బద్దు, కొర్ర లక్ష్మీ ప్రశాంత్,కొర్ర కిషన్ నాయక్,అంగన్వాడీ టీచర్లు బుజ్జి, కమలమ్మ,లచ్చి, ఆశ కార్యకర్త ధనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# వెంకటంపేట స్టేజి తండాలో ఉచిత వైద్య శిబిరం

**లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**




**దేవరకొండ ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వెంకటంపేట స్టేజి (దేన్యా నాయక్ తండా)లో ఉచిత కంటి, బీపీ మరియు షుగర్ పరీక్షల వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రొఫెసర్ లయన్ రామావత్ రవి నాయక్ మరియు వారి సోదరులు తమ తండ్రిగారైన స్వర్గీయ రామావత్ పిత్యా నాయక్ జ్ఞాపకార్థం ఈ శిబిరానికి పూర్తి ఆర్థిక సహాయాన్ని అందించారు. శిబిరానికి విచ్చేసిన తండావాసులకు ఉచితంగా రక్తపోటు (బిపి), మధుమేహం (షుగర్) పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిత్యా నాయక్ స్మారకార్థం సమాజ సేవకు ముందుకు వచ్చిన రవి నాయక్ కుటుంబ సభ్యులను వారు అభినందించారు. ఈ అవకాశాన్ని తండావాసులు మరియు చుట్టుపక్కల గ్రామస్థులు పెద్ద సంఖ్యలో వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, సెక్రటరీ మల్లయ్య, హనుమాన్ నాయక్, బగ్గ నాయక్, హరి నాయక్, శ్రీను నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణ వేగవంతం చేయండి

**-మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**



**నల్గొండ, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రబీ ధాన్యం సేకరణపై మంగళవారం నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లా కలెక్టర్, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పెంచాలి. అన్ని కేంద్రాలకు తగినన్ని లారీలు పంపి రాత్రి--పగలు లైట్లు ఏర్పాటు చేసి ధాన్యం మిల్లులకు తరలించాలి. ఎక్కువగా ధాన్యం వచ్చే గ్రామాల్లో అదనపు లారీలు పంపాలి. అవసరమైతే పాఠశాలలు, ఫంక్షన్ హాల్స్ వద్ద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. రైతులు, నిర్వాహకులకు తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి” అని ఆదేశించారు. నల్గొండ నియోజకవర్గంలో 2 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, వై. అశోక్ రెడ్డి, పౌర సరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా అధికారులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, గుమ్మల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ ఎస్బీఐ కేసులో నలుగురు అరెస్ట్




**నల్లగొండ, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేవరకొండ ఎస్బీఐ-- ఏసీబీ బ్రాంచ్‌లో జరిగిన భారీ ఆర్థిక మోసాన్ని పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రూ. 2.42 కోట్లు నగదు, 6 మొబైల్ ఫోన్లు, 1 ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు లెండల చక్రపాణి (హౌస్‌కీపింగ్ ఉద్యోగి) ఇనాక్టివ్ ఖాతాలను దుర్వినియోగం చేసి, మేనేజర్ పుట్ట వెంకట రామాంజనేయులు, రికవరీ ఏజెంట్ కేతవత్ రాంలాల్, ఫోటోగ్రాఫర్ మారేపల్లి శివతో కలిసి నకిలీ ఆధార్, పాన్ కార్డులు తయారు చేసి, యోనో యాప్ ద్వారా అక్రమంగా డబ్బులు బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మోసం వెలుగులోకి రావడానికి కారణం, ఒక ఖాతాదారునికి అక్రమ కేవైసీ అప్డేట్‌పై అలర్ట్ మెసేజ్ రావడం. వెంటనే బ్యాంక్‌ను సంప్రదించడంతో అసలు విషయం బయటపడింది. కేసును డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో, ఇన్స్పెక్టర్ పీ. వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేసి నిందితులను అదుపులోకి తీసుకుంది. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఈ కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించారు.

# డీటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



P. వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షులు



N. రాజేష్ కుమార్ ప్రధాన కార్యదర్శి

**ఎలిగేడు, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలో జరిగిన డీటీఎఫ్ మండల కౌన్సిల్ సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పి. వెంకటేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా జి. శ్రీవాణి, డి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా ఎన్. రాజేశ్ కుమార్, కార్యదర్శులుగా సీహెచ్. స్రవంతి, పి. శ్రీధర్, నవీన్ ఎంపికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా ఏ. సంతోష్ రెడ్డి, ఏ. రామ్మోహన్, వెంకటేశ్వర్లు, కన్వీనర్‌గా పి. సుధాకర్, సభ్యులుగా ఏ. అనిత, మల్లేశం ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పిడి సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, “ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన 5 డీఏలు, పీఆర్సీని వెంటనే ప్రకటించాలి. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి” అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైభవంగా కాటమయ్యకు తాటి ముంజల పూజలు



కాటమయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గౌడ సంఘం నాయకులు

**ఎలిగేడు, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గౌడజాతి మూలపురుషుడు శ్రీ కాటమయ్య (కంఠమహేశ్వరుడు)కు ధూళికట్ట గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోనం వండి ముంజకాయలు, కొబ్బరికాయలతో అభిషేకం చేసి తాటి కల్లు గీయడం ఆనవాయితీగా కొనసాగింది. సంఘ అధ్యక్షుడు భూసారపు నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ, “ప్రతియేటా కాటమయ్యకు ముంజకాయల అభిషేకం, తాటి కల్లు గీయడం సంప్రదాయం. గీతా కార్మికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, గౌడకులస్థులు, గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని శ్రీరేణుక ఎల్లమ్మను ప్రార్థిస్తున్నాం” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పూదరి వెంకటేశం, సంఘ నాయకులు, కార్యకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

- గుమ్మకొండ రాజు



**కల్వకుర్తి, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మకొండ రాజు డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "1950 రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేసి దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలి. మతం మారినందుకు హక్కులు కోల్పోవడం అన్యాయం. అంబేద్కర్ స్ఫూర్తితో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పోరాటం కొనసాగిస్తాం" అని అన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మకొండ రాజు మాట్లాడుతూ, "క్రైస్తవ మతంలోకి వెళ్ళిన దళితులకు మాత్రమే హోదా మారడం వివక్ష. ఐక్య పోరాటంతో ఎస్సీ హోదా సాధించాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత క్రైస్తవుల హక్కుల పోరాట సమితి సభ్యులు, పాస్టర్లు, యువత, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## నేడు ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరా అంతరాయం



**యాచారం,ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యాచారం మండల పరిధిలోని బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు.
నేడు 33 కెవి యాచారం సబ్ స్టేషన్, 33 కేవీ నందివానపర్తి, 33 కేవీ చింతుళ్ళ, 33 కేవీ మేడిపల్లి, 33 కేవీ తాడిపర్తి పరిదిలో ఉన్న --ఊ 11 కేవ్ ఫీడర్ పైన విద్యుత్ మరమత్తులు (మెంటెనెన్స్ ) కార్యక్రమం ఉండటం వలన నేడు సాయంత్రం 4 శి 6 వరకు ఈ ఫీడర్ పరిదిలో ఉన్న యాచారం గ్రామస్తులు, గండ్లగూడ గ్రామస్థులు, మొండిగోరెల్లి గ్రామస్థులు, గ్రామస్తులు, చౌదేర్పల్లి గ్రామస్థలు, తాడిపర్తి గ్రామస్థలు,నక్కర్త గ్రామస్థలు, నానాక్నగర్ గ్రామస్తులు,మేడిపల్లి గ్రామస్థులు, కూరమీద గ్రామస్థులు, నందివనపర్తి గ్రామస్థులు, చింతుళ్ళ గ్రామస్థులు, నాజదిక్ సింగారం గ్రామస్తులు, అయ్యావారిగుఫా గ్రామస్థులు మరియు వ్యవసాయ పోలాలకు, పౌల్టరీ ఫార్మ్స్ కు విద్యుత్ అంతరాయము ఉండును. కావున విద్యుత్ వినియోగదారులు మరియు రైతులు ఇట్టి విషయాన్ని గమనించి సహకరించగలరని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

## రుచికరమైన భోజనం అందించాలి

- మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్



**ఆమనగల్లు, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
విద్యార్థినులకు రుచికరమైన భోజనం అందించాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణ కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన తనిఖీ చేసి వంట సామగ్రి, రికార్డులను పరిశీలించారు. మెను ప్రకారం భోజనం పెట్టాలని, విద్యార్థినిల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యార్థినులు చదువుతో పాటు అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. వసతి గృహంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ వో పద్మ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### దుబాయ్‌లో అనారోగ్యంతో గన్నేరువరం వాసి మృతి

**గన్నేరువరం, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గన్నేరువరం మండలం కాసింపేట గ్రామానికి చెందిన వేదిర శ్రీనివాస్ శనివారం దుబాయ్‌లో అనారోగ్యంతో మృతి చెందారు. కొద్దిరోజులుగా చికిత్స పొందుతూ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. మృతుడికి ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు ప్రభుత్వ సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. మృతదేహం బుధవారం స్వదేశానికి రానున్నట్లు సమాచారం.



# విబి జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి

-పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి.
-తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్



**దేవరకొండ ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల పొట్టగొట్టే వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్య లు కంబాలపల్లి ఆనంద్ కోరారు మంగళవారం రోజున కొండ మల్లేపల్లి మండల కేంద్రంలో ఎంపీడీవో ఆఫీసు ముందు ఉపాధి కూలీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరుగు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యుపిఏ కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో సామాజిక భద్రత, వలసల నివారణలో భాగంగా, కమ్యూనిస్టు పార్టీలు పోరాడి సాధించిన జాతీయ ఉపాధి ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి విబిజి రాంజీ పథకం పేరుతో ఉపాధి కూలీల పొట్టగొట్టే చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ చట్టానికి వ్యతిరేకంగా వ్యవసాయ కూలీలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉపాధి కూలీలకు పని ప్రాంతాల్లో కనీసం మంచినీటి సౌకర్యం కల్పించకపోవడం శోచనీయమన్నారు. ప్రథమ చికిత్స కిట్టులు లేకుండా, టెంట్లులేకుండా వ్యవసాయ కూలీలతో పనులు చేయించుకుంటున్నారన్నారు. ఐరిష్ పేరుతో పని ప్రదేశంలో సిగ్నల్ రాకపోవటంవల్ల పని ప్రదేశంలో నుండి అందరు ఇంటికి పోవటం జరుగుతుంది కొంతమంది కూలీలకు ముఖము పోటోవ్ రాకపోవటం నానా రకాలుగా ఉపాధి కూలీలు ఇబ్బంది పడుతున్నారు అన్నారు. మూడు నాలుగు గంటలు పని చేసిన తర్వాత ఐరిష్ రాకుంటే ఉపాధి కూలీలను ఇంటికి పంపుతున్నారని, ప్రత్యామ్నాయ మార్గాలు లేకుండా పని చేసిన తర్వాత కూడా ఇంటికి పంపడం చాలా దుర్మార్గం అన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు పని చేస్తున్నప్పటికీ కూలి గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు వారాలుగా పనిచేసిన డబ్బులు ప్రభుత్వం ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు. పని మొదలుపెట్టినప్పుడు, ముగిసిన తర్వాత రెండు సార్లు ఫోటోలు తీయడం వల్ల కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాఫ్ట్వేర్ ప్రాబ్లం తో ఫోటోలు మ్యాచ్ కాకపోవడం వల్ల కార్మికులు పని నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈ కే వై సి పేరుతో జాబ్ కార్డు తొలగించటం కొత్తగా పని కార్డు కోసం అప్లై చేస్తున్న వారికి జాబ్ కార్డు ఇవ్వడం లేదని కేవలం ఇందిరమ్మ ఇండ్ల సాంక్షన్ అయిన వారికి మాత్రమే ఇస్తామని సమాధానం చెబుతున్నారని, ఇది కార్మికుల పొట్ట కొట్టడమేనని అన్నారు. గత పది సంవత్సరాలుగా గడ్డపారలు, పారులు, తట్టలు లాంటి పనిముట్లు ఇవ్వడం లేదని వెంటనే వాటిని ఇవ్వాలని పని అడిగిన వెంటనే పనులు చూపాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం కుట్రపూరితంగా కూలీలపై కక్షగట్టి ఆ చట్టాన్ని రద్దుచేసి పీబీజీ రాంజీ చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. ఉపాధి హామీ కూలీలందరూ బిజెపి తీసుకొచ్చిన విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని కొత్త జాబ్ కార్డు వెంటనే ఇవ్వాలని పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని రెండు సార్లు ఫోటో తీసే విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ధర్నా అనంతరం ఎంపీడీవో కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది . ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కావలి కృష్ణయ్య, మెట్లు వాస్కుల యాదయ్య, విజయశాంతి, సత్యనారాయణ ,పార్వతమ్మ, సత్తయ్య ,సత్యమ్మ, భాగ్యమ్మ ,తదితరులు పాల్గొన్నారు.

## వీధి నాటకాలను ప్రోత్సహించాలి

- కౌన్సిలర్ పాపిశెట్టి రాము




**ఆమనగల్లు, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వీధి నాటకాల కళాకారులను ప్రోత్సహించాలని ప్రముఖ సంఘ సేవకులు, ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. మండల పరిధిలోని మంగళపల్లి గ్రామంలో జరుగుతున్న భ్రమరాంబ మల్లికార్జున వీధి నాటకానికి సోమవారం రాత్రి ఆయన హాజరై వీక్షించారు. ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ.. అంతరించిపోతున్న వీధి నాటకాలను కాపాడుకోవాల్సి బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వీధి నాటకాలను వీక్షిస్తూ వాటిలో ఉన్న సారంశాలను తెలుసుకోవాలన్నారు. అనంతరం కళాకారులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కళాకారులు కడారి పెద్ద మల్లయ్య, నల్ల కొమరయ్య, బత్తుల జంగయ్య, లోడిగ అంతయ్య నాయకులు శ్రీను నాయక్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీకి బయలుదేరిన ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు



**ఆమనగల్లు, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఈనెల 22న న్యూఢిల్లీ ఇందిరా భవన్ లో జరిగే ఆల్ ఇండియా ఆదివాసి జాతీయ కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశానికి మంగళవారం ఆమనగల్లు పట్టణానికి చెందిన ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్ బయలుదేరారు. 22న జరిగే ఆదివాసి జాతీయ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు, ఆల్ ఇండియా ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ విక్రాంత్ బూరియా లు హాజరవుతారని కృష్ణ నాయక్ పేర్కొన్నారు.

## వంగూరులో పశువులకు టీకాలు



**వంగూరు, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మచినోని పల్లి గ్రామంలో డాక్టర్ వై. మలేష్ పశువులకు గాలికుంటూ వ్యాధి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీముళ్ల సువర్ణ, డీపీటీ సర్పంచ్ వసంత, వార్డు సభ్యులు జవో ఓ. మహేష్, చంద్రశేఖర్, సైదులు, ఎల్ఎస్ఏ లక్ష్మణ్, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

## కవితకు మద్దతుగా ఇబ్రహీంపట్నంలో బైక్ ర్యాలీ



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కవిత ప్రకటించబోయే నూతన రాజకీయ పార్టీకి మద్దతుగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో సాగర్ హైవేపై వంద బైక్‌లతో భారీ ర్యాలీ జరిగింది. మంచిరెడ్డి విజయ్‌కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో మాల్ గ్రామం నుండి నియోజకవర్గ కేంద్రం వరకు యువకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి మాట్లాడుతూ, "కవిత రాజకీయ ప్రస్థానం అమరుల ఆశయాలను నిజం చేస్తూ తెలంగాణ వికాసానికి నాంది అవుతుంది" అన్నారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మంచిరెడ్డి విజయ్‌కిరణ్ రెడ్డి, యువజన నాయకుడు కర్నాటి చంద్రకాంత్ మాట్లాడుతూ, "ఏప్రిల్ 25న మేడ్చల్ మహాసభకు వేలాదిగా తరలి వెళ్లి విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు. ర్యాలీలో స్థానిక నాయకులు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- లయన్స్ జిల్లా గవర్నర్ మహేంద్ర కుమార్ రెడ్డి






**ఆమనగల్లు, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రక్తదానం చేసి ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని కాపాడి ప్రాణదాతలుగా నిలవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, లయన్స్ జిల్లా గవర్నర్ మహేంద్ర కుమార్ రెడ్డి సూచించారు. మంగళవారం తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో లయన్స్ క్లబ్ సభ్యుడు, రెగ్యులర్ రక్తదాత అంజిరెడ్డి 150వ సారి రక్తదానం చేస్తున్న మేరకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి, లయన్స్ గవర్నర్ మహేంద్ర కుమార్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో దాదాపు చుట్టుప్రక్కల గ్రామల నుంచి150 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రాణ దాతలు కావాలని పిలుపునిచ్చారు. 150వ సారి రక్తదానం చేస్తున్న తమ మెంబర్ అంజిరెడ్డిని ఘనంగా సన్మానించి ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పిన్ బహూకరించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ గవర్నర్ చెన్న కిషన్ రెడ్డి, డాక్టర్ దామోదర్ రెడ్డి రీజియన్ చైర్ పర్సన్ జనార్ధన్ రెడ్డి, జోన్ చైర్ పర్సన్ జూలూరు లింగయ్య, క్లబ్ అధ్యక్షుడు కే గోవర్ధన్ రెడ్డి, సెక్రటరీ గంప శ్రీనివాస్, కోశాధికారి గంగుల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ సభ్యులు కండె ఓంకారం, దోమ మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, కే రామ్ రెడ్డి, గుజ్జరి నరసింహ, టీచర్ జంగయ్య, జూలూరు రమేష్, ఎం చంద్రశేఖర్, వెంకటేష్, రాజు బిచ్య నాయక్ , కుమార్ గౌడ్, పిఆర్ఓ ఎండి పాషా తదితరులు పాల్గొన్నారు.


## పర్యవరణంతోనే మానవాళికి ఆరోగ్యం

- లయన్ జిల్లా గవర్నర్ మహేంద్ర కుమార్ రెడ్డి



**ఆమనగల్లు, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మానవాళి మనుగడ బాగుండాలంటే పర్యావరణం బాగుండాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి. మహేంద్ర కుమార్ రెడ్డి అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ మంగళవారం తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో నిర్వహించిన పర్యావరణ వారోత్సవాలు భాగంగా చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా మాజీ గవర్నర్ చెన్న కిషన్ రెడ్డి, డాక్టర్ దామోదర్ రెడ్డి, రీజియన్ చైర్ పర్సన్ జనార్ధన్ రెడ్డి, జోన్ చైర్ పర్సన్ జూలూరు లింగయ్య, క్లబ్ అధ్యక్షుడు కే గోవర్ధన్ రెడ్డి, సెక్రటరీ గంప శ్రీనివాస్, కోశాధికారి గంగుల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ సభ్యులు కండె ఓంకారం, దోమ మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, కే రామ్ రెడ్డి, గుజ్జరి నరసింహ, టీచర్ జంగయ్య, జూలూరు రమేష్, ఎం చంద్రశేఖర్, వెంకటేష్, రాజు బిచ్య నాయక్, కుమార్ గౌడ్, పిఆర్ఓ ఎండి పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు ఉరుములతో కూడిన వర్షం



**ఆమనగల్లు, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు పట్టణ కేంద్రంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కొన్ని రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడిన జనంపై మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. భానుడి భగభగలతో అల్లాడుతున్న జనానికి ఈ వర్షం కొంత ఉపశమనాన్ని ఇచ్చింది, మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# నేడు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేయనున్న ఎమ్మెల్యే



**మాడ్గుల, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నేడు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా మాడ్గుల మండలంలో వివిధ అభివృద్ధి పనులకు శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటలకు ఆర్కపల్లి--పల్గుతాండ రహదారి నిర్మాణానికి రూ. 1.05 కోట్లు వ్యయంతో బిటి, సిసి రోడ్ల పనులకు శంఖుస్థాపన జరుగుతుంది. అనంతరం కొత్త బ్రాహ్మణపల్లి, పాత బ్రాహ్మణపల్లి, మాడ్గులలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం, తహసీల్దార్ కార్యాలయం వద్ద మోడల్ హౌజ్ ప్రారంభం జరుగుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు మాడ్గుల వాసవీ ఫంక్షన్ హాల్‌లో 225 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భట్టు కిషన్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు.

# గ్రామపంచాయతీలలో ఆర్టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలి



**వంగూరు, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగూరు మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో సమాచార హక్కు చట్టం--2005 బోర్డులు ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ప్రజలు ఆర్టీఐ దరఖాస్తులు ఎవరికి ఇవ్వాలి, ఫస్ట్ అప్పీలు ఎవరికి చేయాలి తెలియక ఇబ్బందులు పడుతున్నారని గుమ్మకొండ శివరాజు, ఎన్నమల్ల అనంతరాములు పేర్కొన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే స్పందించి గ్రామపంచాయతీలలో ఆర్టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

# ఆటో యూనియన్ సభ్యుడి కుటుంబానికి చేయూత



**రంగారెడ్డి, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇబ్రహీంపట్నం మున్సిపల్ సీతారంపేట్ ఆటో యూనియన్ సభ్యుడు అనిల్ తల్లి స్వర్గస్తులైన నేపథ్యంలో, వారి కుటుంబానికి నవ్య ఫౌండేషన్ కార్యదర్శి మడుపు వేణుగోపాల్ రావు ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేశారు. అలాగే 40 మంది ఆటో డ్రైవర్లకు షర్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ తత్వవేత్త జెలమోని రవీందర్, జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు సూరమోని సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్ట్ పల్లపు విజయ్, ఆటో యూనియన్ సభ్యులు ప్రదీప్ రెడ్డి, భాస్కర్, సురేష్, సుధాకర్, తుకారం, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## మర్రిగూడలో హిందూ మహాసమ్మేళనం



**మర్రిగూడ, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో హిందూ మహాసమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథి చేజర్ల మఠం పీఠాధిపతి శ్రీనివాసనంద స్వామీజీ మాట్లాడుతూ, "దేశానికి ఆత్మ హిందూ ధర్మం. సమాజాన్ని చైతన్యవంతం చేసి ఐక్యంగా నిలబెట్టడం ద్వారా దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దాలి" అన్నారు. మహిళా వక్త పర్వతం సంధ్యా హిందూ సమాజంలో గౌరవభావం, ఏకాత్మతా భావన, సేవా స్ఫూర్తి పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ కార్యవాహ ఉప్పలంచ మల్లికార్జున్ హిందూ చైతన్యం, శివాజీ మహారాజ్ పోరాట స్ఫూర్తిని గుర్తుచేశారు. కార్యక్రమంలో అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్ గౌడ్, ఉప సర్పంచ్ మహేశ్వరం రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉప్పల వెంకటేష్ ను

# కలిసిన సర్పంచులు

- కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి
- ఉప్పల వెంకటేష్



**ఆమనగల్లు, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, ఇచ్చిన హామీలను విస్మరించిన అంశంపై విస్తృతంగా ప్రచారం చేయాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ సూచించారు. మంగళవారం హైద్రాబాద్ లోని ఆయన నివాసంలో సింగంపల్లి గ్రామ సర్పంచ్ శానమోని సత్యం మరియు రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ.. పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మళ్లీ బీఆర్ఎస్ పాలననే ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో సింగం పల్లి ఉపసర్పంచ్ రవీంద్ర శ్రీను, సభ్యులు మెంబర్ అయోధ్య, చింటూ తదితరులు పాల్గొన్నారు.

# టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సు విజయవంతం చేయండి

- రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 30న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర విద్యా సదస్సు జరగనుంది. జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రాంబాబు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ మాట్లాడుతూ, "ప్రభుత్వ బడులను పరిరక్షించేందుకు, నాణ్యమైన విద్య అందరికీ సమానంగా అందించేందుకు నైబర్హుడ్ కామన్ స్కూల్ విధానం అవసరం. విద్యారంగానికి బడ్జెట్‌లో 18% నిధులు కేటాయించాలని" అన్నారు. సదస్సుకు విద్యా సంచాలకులు డాక్టర్ నవీన్ నికోలాస్, ప్రొఫెసర్ ఎం. కోదండరాం ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. విద్యాపరిరక్షణ కమిటీ నాయకుడు ప్రొఫెసర్ హరగోపాల్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చింతకింది కాశీం, పూర్వ సంపాదకుడు కె. శ్రీనివాస్ ప్రసంగించనున్నారు. మేధావులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# నూతన సబ్‌స్టేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి





**తలకొండపల్లి, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చంద్రధన గ్రామంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మల్లికార్జున స్వామి దర్శించుకుని, కొత్త సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రూ. 2.50 కోట్లు వ్యయంతో ఏర్పాటు చేసిన అదనపు 5 ఎంఎం ట్రాన్స్‌ఫార్మర్ కల్వకుర్తి ప్రజలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తుంది" అని తెలిపారు. కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డ్ సభ్యులు బాలాజీ సింగ్, స్థానిక సర్పంచ్ సొల్లు రంగమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ యటా గీత నరసింహ ముదిరాజ్, విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఈగ మల్లేశం పరామర్శ



**వర్ధన్నపేట , ఏప్రిల్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మృతుడి కుటుంబ సభ్యులను కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పరామర్శించారు.వర్ధన్నపేట మండల కేంద్రానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు జాగీర్ల వీరస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు.విషయం తెలుసుకున్న కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం వారి స్వగృహానికి వెళ్లి వీరస్వామి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం మాట్లాడుతూ వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు.ఈ కార్యక్రమంలో సిలివేరు కుమార స్వామి, పాపారావు, రవీందర్,కరిమిల్ల సంపత్ రావు,శోభన్,శ్రీను, కొమురయ్య, ప్రవీణ్, యాదగిరి, మహేందర్, రమేష్ ,భూషబోయిన సంపత్ యాదవ్,పెద్దూరి రాజ్ కుమార్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## పోతారం(ఎస్)లో వడదెబ్బతో రైతు మృతి



**హుస్నాబాద్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కంసాని దేవేందర్ రెడ్డి (57) వడదెబ్బకు గురై మృతి చెందారు. ఉదయం వ్యవసాయ పనుల కోసం భూమికి వెళ్లిన ఆయన మధ్యాహ్నం తిరుగు ప్రయాణంలో అకస్మాత్తుగా కూలబడి ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.మృతుడి కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలని సిపిఐ డిమాండ్



**గన్నేరువరం, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గన్నేరువరం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఐ నాయకులు మాట్లాడుతూ రైతులు దూర ప్రాంతాలకు వెళ్లి అధిక భారం పడకుండా మండలంలోనే పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.దళారులకు విక్రయించడం వల్ల రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వం చొరవ చూపి కేంద్రాలను ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో మరింత మంది రైతులు పొద్దుతిరుగుడు పంట సాగు చేయడానికి ముందుకు వస్తారని వారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాంతలా అంజిరెడ్డి, మండల కార్యదర్శి చోక్కల శ్రీశైలం, సహాయ కార్యదర్శి కూన మల్లయ్య, మండల శాఖ కార్యదర్శి బోయిన మల్లయ్య, నాయకులు ఎండి నయీమ్, న్యత కొమరయ్య, రాపోలు రాజమల్లు, బుట్ల భాస్కర్, చోక్కల కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్కల దాడిలో ఆవు మృతి

**గన్నేరువరం, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జంగపల్లి గ్రామంలో పిచ్చికుక్కల దాడిలో అటికం మధుసూదన్‌కు చెందిన పాడి ఆవు మృతి చెందింది. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో సుమారు రూ.30 వేల విలువైన పశువు చనిపోయింది.గత కొన్ని రోజులుగా గ్రామంలో పిచ్చికుక్కల దాడులు పెరుగుతుండటంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**కరీంనగర్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చావును ఎవరూ కోరుకోలేదని, ఆయనకు గౌరవం ఇచ్చామని తెలిపారు. అసెంబ్లీకి వచ్చి ఎస్సీ వర్గీకరణ, బీసీ బిల్లుపై చర్చించాలని ఆహ్వానించినా స్పందించలేదని విమర్శించారు.రాష్ట్ర ప్రజలు 2023 ఎన్నికల్లో మార్పు కోరుకొని ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు నిధులను సక్రమంగా వినియోగించలేదని, అప్పుల భారంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడిందని అన్నారు. అయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ ప్రజలకు న్యాయం చేస్తోందని తెలిపారు.ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, సన్నవడ్లకు బోనస్ ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమాన అవకాశాలు కల్పిస్తూ ముందుకు సాగుతోందని, రాబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ కాళేశ్వరం కేసు విషయంలో సీబీఐ విచారణకు చొరవ చూపాలని సూచించారు. ఈ సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఎలక్టోరల్ మ్యాపింగ్ పూర్తి చేయాలి

- కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి ఈఆర్‌ఓలకు ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సిద్దిపేటలో 53 వేల, గజ్వేల్‌లో 33 వేల, దుబ్బాకలో 21 వేల, హుస్నాబాద్‌లో 18 వేల ఎలక్టోరల్ మ్యాపింగ్ పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఈ పనులను పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు.మ్యాపింగ్ జరగని ఓటర్ల వద్దకు వెళ్లి ఏఈఆర్‌ఓలు వెరిఫికేషన్ చేయాలని, బిఎల్‌ఓలు, సూపర్వైజర్లు, జీపిఓలు కలిసి డోర్ టు డోర్ వెరిఫికేషన్ నిర్వహించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎస్‌హెచ్‌జీ మహిళలను, అర్బన్ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను వినియోగించి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బిఎల్‌ఓల వారీగా ఏజెంట్లను నియమించాలని, భూ భారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌ఓ నాగరాజమ్మ, ఆర్డీవోలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

## ఘనంగా కోటిలింగాలలో శ్రీ కోటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం



**వెలుగటూరు, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెలుగటూరు మండలం కోటిలింగాలలో శ్రీ కోటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీ కృష్ణ పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఎంపీ ప్రజల సుఖశాంతులు, సమృద్ధి కోసం ప్రార్థనలు చేశారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హనుమాన్ దీక్షాపరులకు అన్నప్రసాద వితరణ



**కరీంనగర్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రశాంత్ నగర్ కాలనీలోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో హనుమాన్ దీక్షలో ఉన్న స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దీక్షా స్వాములకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైద్యులు, సేవా సమితి సభ్యులు, కాలనీ వాసులు, పెద్ద సంఖ్యలో హనుమాన్ దీక్షా స్వాములు పాల్గొన్నారు.

## రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మారిన కరెంట్ స్తంభాలు



**కరీంనగర్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భగత్ నగర్ 1/ఏ వీధి రహదారిలో మధ్యలో నిలిచిన కరెంట్ స్తంభాలు వాహనదారులు, స్థానిక ప్రజలకు ఇబ్బందికర పరిస్థితులు సృష్టిస్తున్నాయి. పోల్స్ చుట్టూ చెట్ల తీగలు, మొక్కలు పెరిగి ఉండటంతో ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాలంలో ఇనుప స్తంభాలు కరెంట్ ఉత్పత్తి చేసి షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉన్నందున సిమెంట్ పోల్స్ వాడకంలోకి తేవాలని, వైర్లు గాలి దుమారంలో ఒకదానికొకటి తగలకుండా ప్లాస్టిక్ పైపులు అమర్చాలని ప్రజలు కోరుతున్నారు. రహదారి మధ్యలో ఉన్న పోల్స్‌ను పక్కకు జరపాలని, చెట్లు తీగలను తొలగించాలని స్థానికులు కార్పొరేటర్, సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## రేకుర్తిలో చెరువు పునర్జీవ పనులకు శంకుస్థాపన



**కరీంనగర్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రేకుర్తి చెరువు పునరుజ్జీవన పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన కరీంనగర్‌లో ప్రతి గల్లీ గల్లీలో రోడ్లు నిర్మిస్తామని ప్రకటించారు. ప్రజల సహకారంతో నగర రూపురేఖలు మార్చి అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. శంకుస్థాపన అనంతరం ఆయన బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, మహిళా బిల్లుపై కాంగ్రెస్, డీఎంకే, ఇతర పార్టీల వైఖరిని తప్పుబట్టారు. దక్షిణాదికి అన్యాయం చేసిన డీలిమిటేషన్ బిల్లుపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.బండి సంజయ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో బీజేపీ మాత్రమే కట్టుబడి ఉందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు నిజమైన అభివృద్ధి కోసం బీజేపీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# జనగణన--2027పై దృష్టి , తాగునీరు, వసతి గృహాలపై కలెక్టర్ చిత్రా మిశ్రా ఆకస్మిక తనిఖీలు



**కరీంనగర్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జనగణన--2027లో తప్పులు లేకుండా పారదర్శకంగా నమోదు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సిబ్బందిని ఆదేశించారు. చొప్పదండి బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పరిశీలించారు. మే 11 నుంచి జూన్ 9 వరకు ఇండ్ల గణన, ఫిబ్రవరి 2027లో వ్యక్తులవారీగా సమాచారం సేకరణ జరగనుందని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆమె అధికారులను ఆదేశించారు. గుమ్లాపూర్, కాట్నపల్లి పంచాయతీ పరిధిలోని మల్లన్నపల్లి గ్రామంలో మంచినీటి బావులను ప్రత్యక్షంగా పరిశీలించి, పైప్‌లైన్ లీకేజీలను తక్షణమే సరిచేయాలని సూచించారు. నీటి సరఫరాలో అంతరాయం లేకుండా శాశ్వత ప్రణాళిక రూపొందించాలని పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు. చొప్పదండిలోని ఎస్సీ సంక్షేమ శాఖ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ వంటగది, మరుగుదొడ్లు, డార్మెటరీ హాల్, భోజనశాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డిపిఓ జగదీశ్వర్, తహసీల్దార్ నవీన్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా పోషణ పాకవాడలో డొనేషన్స్ డే




**కరీంనగర్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టులోని కోతి రాంపూర్ సెక్టార్, పోచమ్మవాడ అంగన్వాడి సెంటర్‌లో డొనేషన్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ మాసం గణేష్ హాజరై పిల్లలకు డ్రాయింగ్ బుక్స్, స్కెచ్ పెన్నులు, వంట సామాగ్రి కోసం కుక్కర్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు అంగన్వాడి కేంద్రాలకు రావాలని, ఐసిడిఎస్ అందించే సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సూపర్వైజర్ ఎస్. అరుణ మాట్లాడుతూ అంగన్వాడిలో పిల్లలకు ఆటపాటల ద్వారా విద్య నేర్పిస్తున్నారని, ప్రైవేట్ సంస్థలకు దీటుగా పనిచేస్తున్నారని తెలిపారు. తల్లులు పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపి అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారుకార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సరూప, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోలో కార్మికుల నిరసన



**హుస్నాబాద్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్టీసీ బస్సు డిపో ఎదుట కార్మికులు గేట్ ధర్నా చేపట్టారు. తమ 32 డిమాండ్లపై స్పందన లేకపోవడంతో ఆందోళన తీవ్రరూపం దాల్చింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, పిఆర్సీ బకాయిలను విడుదల చేస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదని కార్మికులు విమర్శించారు. గత 30 నెలలుగా ఎదురుచూస్తున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో సమ్మెకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు ప్రభుత్వం స్పందించకపోతే అర్ధరాత్రి నుండి సమ్మె ప్రారంభిస్తామని హెచ్చరించారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. అన్ని పార్టీల మద్దతు కోరారు.

## వైశ్య హాస్టల్‌లో కరీంనగర్ వాసికి అరుదైన గౌరవం




**కరీంనగర్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ముషీరాబాద్ వైశ్య హాస్టల్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో కరీంనగర్ పట్టణానికి చెందిన నార్ల శ్రీనివాస్ కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రం అందజేసి, చిరు సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో గంజి రాజమౌళి, రమేష్ గేల్లి, గంజి స్వరాజ్య బాబు పాల్గొని శ్రీనివాసును అభినందించారు. హాస్టల్ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం ఆయన కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నియామకంతో కరీంనగర్ పట్టణవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ, శ్రీనివాస్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.


## తమిళనాడును తలవంచనివ్వను

**- లౌకిక ప్రగతిశీల కూటమికి ఓటు వేయండి!**
**-- ఎంకె స్టాలిన్**

**చెన్నై ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ మంగళవారం తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ఆయన ఓటర్లను ఉద్దేశించి, తమ ప్రజాస్వామ్య కర్తవ్యాన్ని నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. గత ఐదేళ్లుగా తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించానని, అన్ని రంగాలలో తమిళనాడును నంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టానని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టాలిన్, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. "దాస్యం అంటే ఏమిటి, ధైర్యం అంటే ఏమిటి? నటన అంటే ఏమిటి, కష్టపడి పని చేయడం అంటే ఏమిటి?" అని ప్రశ్నిస్తూ, ప్రజలు ఈ విషయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. లౌకిక ప్రగతిశీల కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ ఎన్నికలు తమిళనాడు భవిష్యత్తును నిర్ణయిస్తాయని, రాష్ట్ర గౌరవాన్ని కాపాడటానికి లౌకిక ప్రగతిశీల కూటమికి ఓటు వేయడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు.

## బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు..13 మంది మృతి..

**- కేరళలోని త్రిస్సూర్‌లో ఘటన**



**త్రిస్సూర్: ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేరళలోని సెంట్రల్ త్రిస్సూర్ జిల్లా ముండతికోడ్‌లో మంగళవారం భారీ పేలుడు సంభవించింది. ఓ బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ఈ దుర్ఘటనలో 13 మంది మృతిచెందగా... గాయపడిన పలువురి పరిస్థితి విషమంగా ఉన్నది. ఘటన సమయంలో 40 మంది అక్కడ ఉన్నారని అధికారులు భావిస్తున్నారు. త్రిస్సూర్ పూరం పర్వదినం కోసం ఒక ఆలయానికి అవసరమైన బాణసంచాను తాత్కాలిక షెడ్‌లో తయారు చేస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పేలుళ్ల శబ్దం కిలోమీటర్ల మేర వినిపించిందని.. ఈ ప్రమాదంలో చుట్టు పక్కల ఇండ్లు దెబ్బ తిన్నాయని స్థానికులు తెలిపారు. పేలుళ్లు ఇంకా కొనసాగుతుండటంతో సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉం డటం ప్రమాదానికి ఒక కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. గాయపడిన వారిని దవాఖానకు తరలించడంలో స్థానికులు సహాయ పడ్డారు. ఖాళీగా ఉన్న వ్యవసాయ పొలాల్లో ఇటీవల తాత్కాలిక బాణసంచా తయారీ యూనిట్లను నెలకొల్పుతున్నట్టు అధికారులు గుర్తించారు.

## కేదార్‌నాథ్ ఆలయంలో మొబైల్ ఫోన్లపై నిషేధం



**కేదార్‌నాథ్: ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేదార్‌నాథ్ పవిత్రతను సంరక్షించేందుకు ఆలయ ప్రాంగణంలో మొబైల్ ఫోన్ల వాడకంపై నిషేధం విధించినట్టు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. ఆలయం లోపలికి ఫోన్లు తీసుకురావడం, ఫొటోలు తీయడం, వీడియోలు, రీల్స్ రికార్డ్ చేయడంపై నిషేధం విధించారు. గుడిలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడానికి, యాత్రికులకు సజావుగా దర్శనం కలుగడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు వినీత్ పోస్తి తెలిపారు.

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి కూలీల నిరసన




**అమ్రాబాద్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అమ్రాబాద్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో కూలీలు తమ న్యాయమైన వేతనాలను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వీబిజి రాంజీ బిల్లును రద్దు చేసి, ఉపాధి హామీ చట్టాన్ని పాత విధానంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీళ్లు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అదనంగా రోజువారీ అలవెన్సులు రూ.600కు పెంచాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేల సాయం, దిక్కులేని మహిళలకు నెలకు రూ.2,500 చెల్లించాలని నేతలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లేష్, మండల కార్యదర్శి చింత బాలయ్య, ఉపాధ్యక్షురాలు డి. భాగ్యమ్మ, యాదవ సంఘం నాయకులు, రైతు సంఘం ప్రతినిధులు, సీపీఎం నేతలు మరియు పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఆర్టీసీ సమ్మె సైరన్




**అమ్రాబాద్, ఏప్రిల్ 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రంలో మరోసారి ఆర్టీసీ సమ్మె సెగ మొదలైంది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ, ఈనెల 22వ తేదీ నుండి బస్సులను నిలిపివేస్తామని కార్మిక సంఘాలు ప్రకటించాయి. అర్ధరాత్రి లోపు ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని నేతలు స్పష్టం చేశారు. ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న మాట్లాడుతూ ఈ సమ్మె మరోసారి సకల జనుల సమ్మెలా ఉగ్రరూపం దాల్చుతుందని హెచ్చరించారు. ప్రైవేట్ సిబ్బందిని పెట్టి బస్సులు నడిపి సమ్మెను నిర్వీర్యం చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే, దాన్ని అడ్డుకునే మార్గాలు తమకు తెలుసని అన్నారు. ప్రస్తుతం జేఏసీలో ఉన్న యూనియన్లతో పాటు స్వతంత్ర కార్మికులు కూడా ఈ సమ్మెకు మద్దతు తెలుపుతున్నారు. ప్రభుత్వం చర్చలకు పిలవకపోతే 22వ తేదీ మొదటి షిఫ్ట్ నుండే బస్సులు డిపోలకే పరిమితం కానున్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థ స్తంభించే ప్రమాదం కనిపిస్తోంది.